
www.prajasakti.com
ప్రజాశక్తి
5
మంగళవారం 19 మార్చి 2024



అనుమతి లేకుండా బ్యానర్లు, పోస్టర్లు పెట్టరాదు

రిటర్నింగ్ ఆఫీసర్ అదితి సింగ్ ఐఏఎస్


ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, ఎవ్వరు తమ అనుమతి లేనిదే నగరంలో ఎక్కడ కూడా బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు పెట్టరాదని తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తిరుపతి నగరంలో ఇప్పటికే ఏర్పాటు చేసి వున్న అన్ని పోస్టర్లను, బ్యానర్లను తొలగించడం జరిగిందని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్లు నగరంలో పర్యటిస్తూ నియమ నిబంధనలు పటిష్టంగా అమలు పరిచేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలువ పైనే రెండు అంతస్తుల భవనం

నిద్రావస్థలో టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు కొన్ని సందర్భాల్లో కళ్ళు మూసుకుని ఉంటారన్న విమర్శలున్నాయి.. మరికొన్ని సందర్భాల్లో డబ్బులు కావాలంటే అక్రమ కట్టడాలు కూల్చకుండా వదిలేస్తారు. తిరుపతి టౌన్ ప్లానింగ్ విభాగంలో ఈ విధానం పరిపాటిగా మారింది. ప్లానింగ్ సిబ్బంది చేరడంతో టౌన్ ప్లానింగ్ విచ్చలవిడిగా అక్రమకట్టడాలను ప్రోత్సహించే వారి దగ్గర పెద్దఎత్తున నగదును తీసుకోవడం ఆనవాయితీగా మారింది. ఏసీబీ దాడులు చేసినా టౌన్ ప్లానింగ్ విభాగంలో తమను ఎవరు ఏమి చేసుకోలేరనేది ధీమాతో ఉంటున్నారు. నగర పాలక సంస్థ 43వ డివిజన్‌లోని దోబి ఘాట్ పక్కనే ఉన్న మురుగునీటి కాలవపైనే ఫిల్లర్లు వేసి మరీ రెండు అంతస్తుల భవనం నిర్మించేశారు. ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు కళ్లు మూసుకున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మురుగు వెళ్లడానికి నిర్మించిన కాలువల్లో ఫిల్లర్లు వేసి మరీ భవనాలు కడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆ వార్డు ప్రజలు అడుగుతున్నారు. వర్షాకాలంలో మురుగునీటి కాలవలు ఆక్రమణలు గురికావడంతో కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి, 43వ డివిజన్లో కాలువ పైనే ఇల్లు నిర్మించిన ఘనుడు ఎంతకు తెగించారో దీన్ని బట్టి అర్థమవుతుంది. నగరంలో కాలువలు కుచింకుపోవడానికి కారణం కబ్జాదారుల సంఖ్య పెరగడం, ఆక్రమ కట్టడాల నిర్మాణమే. తిరుపతి నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ శాఖను ఎందుకు ఏర్పాటు చేశారో తెలీడం లేదు కానీ, లంచాలు ఇస్తే కాలువను కూడా పూడ్చి భవనాలు నిర్మిస్తున్న సంఘటనలు తిరుపతి నగరంలో కోకో కొల్లాలుగా ఉన్నాయి. కమిషనర్ స్పందించి ఈ కట్టడంపై చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో వర్షపు నీరు ఉధృతిలో ఈ భవనం



కాలువ పైనే రెండు అంతస్తుల నిర్మించిన భవనం

కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు తొత్తుగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని లేదంటే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాగే ఉంటే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పక్కనే ఉన్న కాలువను కూడా ఆక్రమించి భవనం నిర్మించేస్తారు ఏమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..

కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

మురుగునీటి కాలువను ఆక్రమించి కాలువలోనే ఫిల్లర్లు వేసి ఇళ్లు కటిని భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కబ్జాలు మితిమీరిపోతున్నాయని, కాలువల సైతం వదిలిపెట్టడం లేదని అన్నారు. నగరంలోని 43వ డివిజన్ పరిధిలో ధోబి ఘాట్ పక్కన ఉన్న పెద్దకాలువపై ఇల్లు నిర్మాణం చేసుకొని కాపురం ఉంటున్న మున్సిపల్ అధికారుల కనబడడం లేదా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీకి చెందిన స్థలంలో ఒక అడుగు స్థలాన్ని ఎవరు ఆక్రమించినా వారిపై చర్యలు తీసుకునే మున్సిపల్ యంత్రాంగం రెవెన్యూ అధికారులు నేడు మాల్వాడి గుండం నుండి నీరు వచ్చేటటువంటి అతిపెద్ద కాలువ ఆక్రమణకు గురై భవనం ఏర్పాటు చేసుకుని ఆఇంటిలో కాపురం ఉంటుంటే అధికారులకు ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలన్నారు. ఇదంతా చూస్తుంటే అధికారులు కూడా మామూలు మత్తులో పడిపోయి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భారీ వర్షాలు వచ్చేటప్పుడు ఆ కాలవకుండానే కఫిలతీర్థం జలపాతం నుండి నీరు దిగువకు వెళ్ళబడుతుంది. అటువంటి కాలువలను సైతం కాపాడులేని పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు ఉన్నారంటే మీరు ఏ గుడ్డి గుర్రానికి పళ్ళు తోముతున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన హెచ్చరించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

- 162 పరీక్ష కేంద్రాల్లో 95.24 శాతం హాజరు
- 6 ఫ్లయింగ్ స్క్వాడ్, 162 మంది చీఫ్ సూపరిటెండెంట్లు
- 1753 మంది ఇన్విజిలేటర్‌లతో పర్యవేక్షణ



ప్రజాశక్తి- తిరుపతి : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లాలో 162 పరీక్ష కేంద్రాల్లో, 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1753 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో ప్రశాంతంగా పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. సోమవారం ఉదయం నిర్వహించిన తెలుగు పరీక్షకు మొత్తం 28,415 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 27,063 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 1352 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. 95.24 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే తిరుపతి అర్బన్ పరిధిలో 36 పరీక్షా కేంద్రాల్లో పరీక్షల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పరీక్షలు నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో 398 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ తెలిపారు.

సత్యవేడు: బాలుర గురుకుల పాఠశాల కేంద్రంలో 244 మంది విద్యార్థులు గాను 241 మంది పరీక్షలకు హాజరైనట్టు సంబంధిత పరీక్షల ప్రధాన అధికారి మారయ్య, డిపార్ట్మెంట్ అధికారి రమేష్ పేర్కొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని తొమ్మిది కేంద్రాల్లో 1367 మందికి గాను 1332 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలు రాయగా 35 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.



దొరవారిసత్రం: మండల కేంద్రంలో 463 మంది విద్యార్థులు పది పరీక్షలు రాసినట్లు ఎంఈవో తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటి తహశీల్దార్ గోపిరెడ్డి పరిశీలించారు.

ఎస్వి జూ పార్కులో బెంగాల్ టైగర్ మృతి



మృతిచెందిన బెంగాల్ టైగర్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో 2016లో జన్మించిన బెంగాల్ టైగర్ అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. 2016లో ఎస్వీ జూపార్కు లోనే జన్మించిన ఈ బెంగాల్ టైగర్ పుట్టుకతోనే గుడ్డిదిగా ఉండేదని, పలు పరీక్షల అనంతరం చికిత్స అందిస్తూ వచ్చామన్నారు. ఆదివారం రాత్రి బెంగాల్ టైగర్ శరీరం పూర్తిగా చికిత్సకు సహకరించక మృత్యువాత పడిందన్నారు. బెంగాల్ టైగర్ వయసు 7సంవత్సరాల ఆరు నెలలుగా ఉందన్నారు. స్థానిక ఎస్వీ యూనివర్సిటీలో బెంగాల్ టైగర్ కు పోస్ట్ మార్టం చేసినట్లు జూ అధికారులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఆరుగురి వద్ద రూ.15లక్షలకు పైగా వసూలు చేసి ఓ యువతి మోసం చేసిన సంఘటన సోమవారం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. ఈ ఘటనపై బాధితులు శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం దక్షిణ కైలాసనగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి బెంగళూరుతో పాటు మరికొన్ని చోట్ల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పి.అనిత వద్ద రూ.2లక్షలు, సి.వివేక్ వద్ద రూ.3.10లక్షలు, ఎం.రజిత వద్ద రూ.1.10లక్షలు, కె.అనిల్ వద్ద రూ.1.15లక్షలు, ఇ.శారద వద్ద రూ.4లక్షలు, బి.గగన్ వద్ద రూ.1.5ల0లక్షలు, పి.దేవకి వద్ద రూ.1.30లక్షలు తీసుకుంది. వీరికి ఉద్యోగాలు వచ్చాయని నమ్మించి బెంగళూరుకు వెళ్లమంది. ఆ యువతి మాటలు విని వారు బెంగళూరుకు వెళ్లారు. అయితే అక్కడకు వెళ్లిన తరువాత అసలు విషయం తెలిసింది. ఆ యువతి చెప్పినట్లు బెంగళూరులో ఎవరూ ఉద్యోగం ఇవ్వకపోవడంతో మోసపోయామని వీరు గ్రహించారు. అక్కడ నుంచి ఆ యువతికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసింది. ఆ తరువాత బాధితులు నేరుగా ఆ యువతి ఇంటికి వెళ్లారు. ఉద్యోగాల పేరుతో తమ వద్ద తీసుకున్న వాపసు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బుకోసం తనపై ఒత్తిడి చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఆ యువతి చెప్పడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువతి నుంచి తమకు డబ్బు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

వినియోగదారుడే 'రా రాజు'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వినియోగదారుడు నిజమైన రారాజు అని సీసీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అనంతశర్మ తెలిపారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో 17, 18 తేదీలలో చెన్నైలో జరిగిన జాతీయ సదస్సులో 'వినియోగదారుల ఉద్యమాన్ని భవిష్యత్ తరాలకు ఎలాంటి మార్గదర్శకాలు చేయాలి' అంశంపై జరిగిన సదస్సులో తిరుపతి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ప్రచురించిన 'వినియోగదారుడే రారాజు' అనే గోడపత్రికను అనంతశర్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిసిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ పి.రాజారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు చక్రపాణి, శంకర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 33 మంది వలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వివిధ కారణాలతో చిత్తూరు జిల్లాలో 33 మంది వలంటీర్లు తొలగింపబడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్ల తొలగింపు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18 మంది వాలంటీర్లను తొలగిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు మున్సిపాలిటీలో 12 మంది, గుడిపాల మండల పరిధిలో ముగ్గురిని విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్ల తొలగింపులు రాజకీయ కారణాలున్నట్లు తెలుస్తోంది. సరైన కారణాలను చూపకుండా తమను తొలగించారంటూ వలంటీర్లు వాపోతున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు, తొలగించడానికి గల కారణాలను తెలుపకుండా తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ మేరకు సార్వత్రిక ఎన్నికల 2024ను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం పూర్తిగా సంసిద్ధంగా కలదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీ శ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమీషన్ సాధారణ ఎన్నికలు- 2024 షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్, జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్.ఎం ధ్యానచంద్రలతో కలసి ఎన్నికల సన్నద్ధత, నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న కార్యాచరణ పై వివరాలను వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి విధులను కూడా సచివాలయ పరిధిలోని వలంటీర్లను అప్పజెప్పడం లేదని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికలను నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే 82 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తున్నాయని, జిల్లాలో 3 కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్ర పరిధిలోని మండలాలలో కవాతు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. గతంలో ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని బైండ్ ఓవర్ చేయడం జరిగిందని, వెపన్స్ అన్నింటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందనీ తెలిపారు. తిరుపతి జిల్లా వరకు సంబంధించి 6.5 కోట్లు సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. 7 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 15 అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి డిఎస్పీ స్థాయి అధికారులు పరిశీలన జరిగిందన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం సిద్ధమని తెలిపారు. అనంతరం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెల్‌ను కలెక్టర్ జెసితో కలిసి పరిశీలించారు.

ఎన్నికల నోటిఫికేషన్ తేది : 18.4.2024
నామినేషన్ల స్వీకరణ కు చివరి తేది : 25.4.2024
నామినేషన్ల పరిశీలన : 26.4.2024
నామినేషన్ల ఉపసంహరణ : 29.4.2024
పోలింగ్ తేది : 13.5.2024
కౌంటింగ్ తేది : 4.6.2024

జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గాలు : 7
పార్లమెంటరీ నియోజకవర్గం: 1
జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య : 17,94,733
పురుషులు : 8,74,738
స్త్రీలు : 9,19,817
థర్డ్ జెండర్ : 178

18-19 సంవత్సరాల వయస్సు ఉండి కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 36162 పురుషులు : 19761, స్త్రీలు :16398
వికలాంగులు ఓటర్లు: 24,481
పురుషులు : 13,867
స్త్రీలు :10,614
థర్డ్ జెండర్ : 0
85 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లు: 7940.
పురుషులు : 3386
స్త్రీలు : 4551
ఎన్ఆర్ఐ ఓటర్లు మొత్తం:287
పురుషులు :233
స్త్రీలు :54
సర్వీస్ ఓటర్లు మొత్తం: 867

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

స్వీప్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జిల్లాలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సోమవారం పట్టణంలో నిర్వహించిన స్వీప్ అవగాహనా కార్యక్రమ ర్యాలీని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర జి.లక్ష్మీ శ, జిల్లా జాయింట్ కలెక్టర్ హెచ్ఎం. ధ్యాన చంద్ర, నగర పాలక కమిషనర్ అదితి సింగ్ జిల్లా అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో భాగంగా ముఖ్యంగా స్వీప్ యాక్టివిటీ (సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) ఓటరుకు అవగాహన పెంచి ఓటు వేయడానికి ఎవరైతే సిద్ధంగా ఉన్నారో వారు వారి ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క ఓటరుకు అవగాహన కల్పించేలా స్వీప్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో నియోజకవర్గ పరిధిలో ప్రతి ఓటర్‌కు అవగాహన కల్పించేలా స్వీప్ యాక్టివిటీని అధికారులందరం కలిసి చేపడుతున్నామని తెలిపారు. ఈ యాక్టివిటీ ద్వారా పలు రకాల ర్యాలీలు చేపట్టి ప్రతి ఒక్కరిలో ఓటింగ్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈర్యాలీ తిరుపతిలోని ఎస్వి యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీలో స్వీప్ నోడల్‌అధికారి మురళీకృష్ణ, జిల్లా అధికారులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నోడల్ అధికారుల విధులపై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో త్వరలో లోక్‌సభ, శాసనసభ 2024 సార్వత్రిక ఎన్నికలు జరగనున్నవని, పోలింగ్ ప్రక్రియపై అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి సమర్థవంతంగా పోలింగ్ విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లోక్‌సభ, శాసనసభ 2024 సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియపై అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులకు స్వయంగా శిక్షణ ఇచ్చి పలు సందేహాల నివృత్తి చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి సమర్థవంతంగా పోలింగ్ విధులు నిర్వహించాలని తెలిపారు. పొరపాటు జరిగిన తర్వాత సరిదిద్దుకోవడం కంటే ముందుగానే పూర్తిగా అర్థం చేసుకొని పొరపాట్లను జరగకుండా చూడడమే ఎన్నికల పోలింగ్ విధుల్లో అతి ప్రధానమైన బాధ్యతగా అన్నారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎస్‌డిసి మురళి, మాస్టర్ ట్రైనర్లు చంద్రమౌళి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీ శా

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధంగా ఏర్పాట్లు చేపడుతున్నామని, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు నడుచుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీ శ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయపార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధంగా ఏర్పాట్లు చేపడుతున్నామని భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిందని, మన రాష్ట్రంలో నాలుగవ దశలో ఎన్నికలు జరగనున్నాయని, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు నడుచుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతులు సువిధ యాప్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఏదేని ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన అంశాలను గుర్తిస్తే వాటిని సి - విజిల్ యాప్ నందు ఫోటో, టెక్స్ట్, వాయిస్, వీడియో రూపంలో పంపవచ్చుని వాటిపై 100 నిమిషాల్లోపు పరిష్కారం చూపించడం జరుగుతుందని తెలిపారు. సాక్షం యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈఆర్ఓ లు వారి పరిధిలో ఎంసిసి టీమ్ లు పక్కాగా పనిచేసేలా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఆర్ఓలు ధ్యానచంద్ర, అదితి సింగ్, కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి, రాంమోహన్ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ ప్యాడ్లగోల

ఎమ్మెల్యే పంపిణీ చేసిన ప్యాడ్ల పట్ల వివాదం

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి- వికోట: మండలం పలమనేరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే వెంకటే గౌడ అందజేసిన ప్యాడ్లతో హాజరైన విద్యార్థులను పరీక్షలకు అనుమతించే విషయంలో మండలంలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే వెంకటే గౌడ గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు విద్యాసామగ్రి, ఫ్యాడ్‌లను పంపిణీ చేస్తున్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు ఫ్యాడ్‌లను 15 రోజుల క్రితమే పంపిణీ చేశారు. అయితే ఫ్యాడ్లపైన ఎమ్మెల్యే తన ఫోటోను ముద్రించి పంపిణీ చేశారు. ఈ ఫ్యాడ్లపై విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు రావడంతో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పలువురు విమర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన సామగ్రి వినియోగించరాదని తెలిసినా సంబంధిత అధికారులు విద్యార్థులకు ముందుగా హెచ్చరిక చేయకపోవడం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలీని విద్యార్థులు ఎమ్మెల్యే ఫొటోలున్న ఫ్యాడ్లతో పరీక్షలకు హాజరుకాగా ఇన్విజిలేటర్లు, పరీక్షల సిబ్బంది లోపలికి అనుమతి పోవడంతో కొంతమంది విద్యార్థులు ఫ్యాట్లను బయటపడేశారు. మీడియా ప్రతినిధులు పలమనేరు ఆర్‌డిఓకు ఫిర్యాదు చేయగా కచ్చితంగా ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందనీ, పలమనేరు నియోజకవర్గంలో ఏ పాఠశాల పరీక్ష కేంద్రంలోనికి ఇలాంటివి అనుమతించరాదని సంబంధిత ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

చర్యలు తీసుకుంటాం... చంద్రశేఖర్, వికోట ఎంఈవో

సమాచార లోపంతో ఈ సంఘటన జరగడం దురదృష్టకరం. ఇటువంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నాం. పరీక్షలు నిర్వహించే సమయానికి విషయం తెలిసి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారిని ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు మా వంతు కృషి చేశాం. పలమనేరు ఎమ్మెల్యే 15 రోజుల క్రితం ఈ ఫ్యాడ్లను పంపిణీ చేసిన విషయం నా దృష్టికి రాలేదు. సోమవారం పరీక్షలు జరిగే సమయానికి విషయం తెలుసుకొని అందుబాటులో ఉన్న విద్యార్థుల ఫ్యాడ్లను బయటపడవేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసాం. ఇకపై జరగనున్న పరీక్షలకు ఆ ఫ్యాడ్లను అనుమతించేది లేదని విద్యార్థులకు తెలిపారు.

షాపు యజమానులకు అవగాహన

ప్రజాశక్తి - చిట్టమూరు: ప్రింటింగ్ ప్రెస్, క్లాత్ షాప్స్, టెంట్ హౌస్, రెస్టారెంట్, చికెన్, గోల్డ్, కూల్ డ్రింక్స్, మినరల్ వాటర్ ప్లాంట్, కళ్యాణ మండపం, ప్రైవేట్ నిర్వాహకులు, మెస్, హోటల్, ఫర్నీచర్ షాప్‌ల యజమానులకు చిట్టమూరు తహశీల్దార్ శ్రీనివాస్ శర్మ సోమవారం అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉందని వారు నిర్వహించే లావాదేవీల పై నిఘా టీమ్ ఉందని, రాజకీయ నాయకులు బల్క్ కొనుగోలు చేస్తే వారి వివరాలు వెంటనే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో షాపుల యజమానులు పాల్గొన్నారు.

చక్రాల సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రామ కమిటీ సభ్యులు వి.రాజేష్ , గురవయ్య ఆధ్వర్యంలో జరిగి కార్యక్రమంలో నగరి నియోజకవర్గం మండలం తిరుమణ్యం పంచాయతీ ఎనమలపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య అనే ప్రత్యేక ప్రతిభా వంతుడు నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ని కలిసి తన వైకల్య పరిస్థితిని వివరించి తనకు రెండు చక్రాల సైకిల్ ఇప్పించాలని అభ్యర్థించారు. స్పందించిన నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ రెండు చక్రాల సైకిల్‌ను రాజేష్ , గురవయ్య ద్వారా చెంచయ్యకు అందించారు. ఈ సందర్భంగా ఆ ప్రత్యేక ప్రతిభా వంతుడు గాలి భానుప్రకాష్‌కి, ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -రేణిగుంట : మండలంలోని తూకివాకం పంచాయతీ ఎస్ఎన్ పురంలో ఇటీవలే మృతి చెందిన బి చంద్రన్(47), సుశీలమ్మ(58) కుటుంబ సభ్యులను రష్ హాస్పిటల్ అధినేత ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సోమవారం పరామర్శించారు. ఇద్దరి కుటుంబ సభ్యులకు జగనన్న సిపాయి భరోసా పథకం కింద డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం నిత్యావసరకులను అందించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను తూకివాకం ఎంపీటీసీ ఆనందరావు శాలువతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి ఆనంద్ రావు, వార్డు సభ్యులు పళని, జయమ్మ, శరవణ అజయ్, శశి కుమార్, అశోక్, స్టీఫెన్, జ్ఞాన రత్నం పాల్గొన్నారు.

ఘనంగా మోహన్ బాబు జన్మదినం

ప్రజాశక్తి-రేణిగుంట : సినీ నటుడు మంచు మనోజ్ పట్టణంలోని అభయ క్షేత్రంలో ప్రత్యేక ప్రతిభా వంతుల మధ్య తన తండ్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు మంచు మోహన్ బాబు ముందస్తు జన్మదినం సందర్భంగా కేకును కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అభయ క్షేత్రంకు సతీ సమేతంగా చేరుకున్న మంచు మనోజ్ ప్రత్యేక ప్రతిభావంతుల మధ్య కేక్ కట్ చేసి మోహన్ బాబుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ సొంత వాళ్లనే రోడ్డుపై వదిలేస్తున్న నేటి సమాజంలో సొంతవాళ్లు లాగా ఆదుకుంటూ జీవితాన్ని ఇష్టపడటం ఎంతో ఆనందంగా ఉంటోందన్నారు. తన తండ్రి మోహన్ బాబు జన్మదిన సందర్భంగా భార్య మౌనికతో కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్ అభిమానులు, అభయ క్షేత్రం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టిటిడి ఉద్యోగుల క్రీడాపోటీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహించారు. టీటీడీ సీనియర్ పురుష, మహిళ అధికారులకు వివిధ కేటగిరీల వారీగా నడక, బాల్ త్రో, బకెటింగ్ ది బాల్, షాట్ పుట్ తదితర పోటీలు నిర్వహించారు.

టిడిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గం ప్రజలు రానున్న ఎన్నికల్లో టిడిపి ఆదరించి, టిడిపి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ని ఆశీర్వదించాలని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం ఆయన ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీతో పాటు స్థానిక టిడిపి నాయకులతో కలిసి నాయుడుపేట పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను సందర్శించి కరస్పాండెంట్లను, ఉపాధ్యాయులను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి నానావాల సుబ్బారావు, జిల్లా టిడిపి కార్యదర్శి బిరదవాడ నారాయణ, తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : రూరల్ మండలం కేబీఆర్ పురం నుండి వైసిపీకి చెందిన 20 కుటుంబాలు నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. పుత్తూరు రూరల్ కేబీఆర్ పురం గ్రామ పంచాయతీలో వైసీపీ నుంచి టీడీపీ లో చేరిన వారికి పలువురు ... ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ 10 సంవత్సరాల నుండి వైసీపీ పాలనలో మంత్రి, ఏ పి ఐ ఐ సి ఛైర్‌పర్సన్ రోజా ఉన్నా నగరి నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం చేయలేదని తన గెలుపుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, బాలాజీ, మోహన్ రాజు, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి వైసిపీ నాయకులు, పట్టణంలోని వీఎం పల్లి యువత సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో టి.నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బారామిరెడ్డి, నాగరాజు, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తిరుపాల్, రవి, సుధాకర్, మునికృష్ణయ్య, పి. ముని కృష్ణయ్య, బి.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సురేష్, చెంచుకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, మోహన్ రెడ్డి, జయగోపాల్, వినోద్, సాయిరాం, వెంకటేష్, కుమార్, చందు, శివ, మాధవయ్య, హనుమాన్ రెడ్డి, తేజ కుమార్, భాస్కరయ్య, చంద్రయ్య, హేమంత్, వెంకటేష్, శ్రీకాళహస్తి పట్టణం వీఎం పల్లి నుంచి సిహెచ్ మోహన్, పసల సాయిచక్రి, షణ్ముగం, సుబ్రహ్మణ్యం వారి మిత్రులు 200మంది ఉన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ : టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయాన్ని శిరసా వహిస్తానని కారని మిట్ట టిడిపి నాయకుడు కందేరి కార్తీక్ నాయుడు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను ఇటీవల చంద్రబాబు నాయుడు రెండవ జాబితాలో ప్రకటించారని, దీంతో పుత్తూరు లోని ఆదిమూలం నివాసంలో సోమవారం కార్తీక్ నాయుడు కలిసి తన మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కారణి మిట్ట సర్పంచ్ కే. పద్మమ్మ , టిడిపి అభిమానులు వెంకటయ్య , రామ్మూర్తి నాయుడు , గుణ శేఖర్ , కుమార్ , రాజేష్ నాయుడు , హరిబాబు , మునికృష్ణమనాయుడు, రఘుపతి నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి బి ఎన్ కండ్రిగ మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు ఆ పార్టీ కార్యకర్తలు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి కుటుంబ సభ్యులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తిని సత్యవేడు నియోజకవర్గపు ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోట రాజేష్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు , సర్పంచులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

శాటిలైట్ ఫోన్లపై శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆటలు కట్టించడానికి, విధులు నిర్వహించే టాస్క్ ఫోర్స్ సిబ్బందికి అవసరమైన ఫోర్స్ తదితర సమాచారాలను కేంద్ర కార్యాలయానికి చేరవేయడానికి టాస్క్ ఫోర్స్ సిబ్బందికి అధికారులు శాటిలైట్ ఫోన్లను అందించారు. వీటి పనితీరుపై సోమవారం టాస్క్ ఫోర్స్ అధికారులకు బిఎస్ఎన్ఎల్ ఏజీఎం లక్ష్మీనారాయణ శిక్షణ ఇచ్చారు. సాటిలైట్ ఫోన్ వినియోగం ఎలాంటి ప్రాంతంలో చేయాలి? వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై కూబింగ్ చేపట్టే అధికారులతో గ్రూప్ డిస్కషన్ చేపట్టారు. సాటిలైట్ ఫోన్ వినియోగాన్ని కొన్ని కేస్ స్టడీలను తెలిపారు. అనంతరం టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆపరేషనల్ టీమ్ లతో ఇంటరాక్టయ్యారు. శాటిలైట్ ఫోన్ల ద్వారా కమ్యూనికేషన్ ఎలా? ఎవరికి చేర వేయాలి? దీనిద్వారా అత్యవసర సమయాల్లో మరో టీమ్ నుంచి సహకారం తీసుకునే వీలు ఉంటుందన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకోడానికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐలు, ఆపరేషన్ బృందాలు పాల్గొన్నారు.

రైతులు ఫారం పాండ్‌లు తవ్వుకునేలా చూడాలి: డ్వామా పీడీ

ప్రజాశక్తి -ఏర్పేడు : రైతులు తమ పొలాల్లో ఫారం పాండ్‌లు తవ్వుకునేలా చూడాలని డ్వామా పీడీ సివి శ్రీనివాస ప్రసాద్ అధికారులకు సూచించారు. మండలంలోని మోదుగులపాలెం పంచాయతీలో నిర్వహిస్తున్న అమృత సరోవర్ పూడికతీత పనులను డ్వామా పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు తీవ్ర మవుతున్న నేపథ్యంలో ఉదయం 6 గంటలకు పని మొదలుపెట్టి కొలతల ప్రకారం పనిచేసి 10 గంటలకల్లా పని విడిచి పెట్టాలని, పని వద్ద తాగునీరు, నీడ వసతిని గ్రామంలోని ఏఎన్ఎం సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ప్రథమ చికిత్స బాక్సు వంటివి పని ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, సిడిసిఎల్ ఆర్‌సి చంద్రశేఖర్ రాజు, జూనియర్ ఇంజనీర్ పాండజా బాలాజీ రావు, బిఎఫ్టి వెంకటాద్రి, మేట్ లక్ష్మీప్రసన్న, కూలీలు పాల్గొన్నారు.

వరుస చోరీలు..ప్రజలు బెంబేలు!

- పనిచేయని సిసి కెమెరాలు - నామమాత్రంగా పోలీసుల గస్తీ - పోలీసులకు సవాలు విసురుతున్న దొంగలు



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణం లో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతు న్నారు. పోలీసుల నామమాత్ర గస్తీ కారణంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మరో వైపు సిసి కెమెరాలు పనిచేయక మూలన పడటంతో దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారుతోంది. దొంగతనాలు అదుపులోకి రాకపోవడంతో పట్టణ ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్లలో నిద్రించాలన్నా, ఇల్లు విడిచి బయట దూర ప్రాంతాలకు వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున రెండు, మూడు గంటల ప్రాంతంలో దర్గా రోడ్ లోని బంగారు దుకాణం, ప్రొవిజన్ స్టోర్‌ల షట్టర్లు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డ సంఘటన పట్టణ ప్రజలను భయాందోళన గురిచేస్తూ పోలీసులను అయోమయ స్థితిలో పడేసింది. రెండు రోజుల క్రితం తిరుమల ఆయిల్ దుకాణం షట్టర్ పగలగొట్టి నగదు దోచుకెళ్లారు. కొద్ది రోజుల క్రితం మూడు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్ల డంతో పాటు ఓ పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో తాళాలు పగలగొట్టి మరీ దొంగ తనానికి పాల్పడ్డారు. పోలీసులుగస్తీని ముమ్మరం చేసి చోరీలను నివారించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తు తు న్నాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయక పోవడానికి తోడు పోలీసు గస్తీ పూర్తిగా లేకపోవడం వల్లే వరస చోరీలు చోటు చేసు కుంటున్నాయని స్థానికులు భావిస్తున్నారు. రెండు రోజులకో సారి పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో దొంగ తనాలకు పాల్పడుతుండడంతో ఏ రోజు ఏ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతాయో ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందో అని పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటి కైనా పై స్థాయి అధికారులు మేల్కొని పట్టణంలో నాణ్యత గల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, చోరీలపై ప్రత్యేక నిఘా వేయడంతో పాటు పోలీసు గస్తీ పటిష్టంగా నిర్వహించి దొంగల బారి నుండి ప్రజలను కాపాడాల్సిన అవసరం అధికారులపై వుంది. పోలీసు యంత్రాంగం నిద్రావస్థనుండి మేల్కొని పట్టణంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుని ప్రజల భయాన్ని తొలగించి రక్షణ కల్పించాల్సి వుంది.

మా భూములకు పట్టాలు ఇవ్వండి

- ఆర్‌డివోకు పెట్లూరు గ్రామ ఎస్‌సి, ఎస్‌టిల వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 'మా భూములకు పట్టాలు ఇవ్వండి..'అంటూ వెంకటగిరి మండలంపెట్లూరు గ్రామ ఎస్‌సి, ఎస్‌టిలు పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్ కుమార్‌కి సిపిఎం నాయకులతో కలిసి వారు అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వెంకటగిరి మండలంలోని పెట్లూరుకి చెందిన ఎస్‌సి, ఎస్‌టిలు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1-2, 12-1, 150-14, 196, 23 లలో ప్రభుత్వ భూములను 190 కుటుంబా లు రెండు ఎకరాలు చొప్పున స్వాధీనం చేసుకొని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం గ్రామ పోరంబోకు భూమి అనాదీనం భూమిగా, చెరువు కాలువ పోరంబోకు భూమి గాను ఉందన్నారు. దీన్ని ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. గతంలో పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఇప్పటి వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి తమ భూములకు పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేష్, అడపాల ప్రసాద్, బి చంద్రయ్య, రమణయ్య, రాజయ్య, నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోనేటి ఆదిమూలం అభ్యర్థిత్వంపై నిరసనలు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థిగా కోనేటి ఆదిమూలం అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల నిరసన హోరు మిన్నంటుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఆదిమూలం ఐదేళ్లు పాటు స్థానిక తెలుగు తమ్ములపై చేసిన దౌర్జన్యాలు మరిచి ఆయనతో కలిసి ఎలా పని చేయాలని మండి పడుతున్నారు. సత్యవేడు టిడిపి అభ్యర్థిగా ఆదిమూలం పేరును అధిష్టానం ఖరారు చేసినప్పటి నుంచి నియోజకవర్గంలో ప్రతిరోజు తెలుగు తమ్ముళ్లు నిరసనలు చేస్తూ అభ్యర్థి మార్పు విషయాన్ని ఒకసారి పరిశీలించాలని కోరుతూ అధిష్టానానికి తమ విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం సత్యవేడులో ఓ కల్యాణ మండపంలో టిడిపి నాయకులు సమావేశమై అధిష్టానం తీరుపై నిరసన గళం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వినిపించారు. వైసీపీలో చెత్తగా మారిన ఆదిమూలం టిడిపిలో బంగారంగా ఎలా మారారని నియోజకవర్గంలో ప్రజలు ఎదురు తిరిగి తమను ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక పోతున్నామని వాపో యారు. ఈ కార్యక్రమంలో నా యకులు ఈశ్వరయ్య, రాధాకృష్ణ, పరుచూరి శివ కుమా ర్, పరంధామయ్య, శివయ్య శెట్టి, అమాస రెడ్డి, ధన శేఖర్,వినాయకం,దేవేంద్రన్ , వెంకటేశులు, సుబ్రహ్మణ్యం, సంతోష్ కుమార్, శివయ్య నాయుడు,మోహన్, హేమభూషణం రెడ్డి,గజేంద్ర పాల్గొన్నారు.

కొత్త విషయాలపై దృష్టి సారించాలి : ఎస్వీయూ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నూతనంగా పరిశోధనలో చేరిన విద్యార్థులు తమ పరిశోధన అంశాలతో పాటు ఇతర పరిస్థితులపై అవగాహనతో పూర్తిస్థాయిలో నూతన విషయాలను శోధించేందుకు తమ సమయాన్ని పూర్తిగా కేటాయించాలని రిజిస్ట్రార్ ఆచార్య ఓయండి హుస్సేన్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం, ఆచార్య పద్మనాభం ఆచార్య శ్యాంమోహన్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలోని ఆర్థిక శాస్త్రం గ్యాలరీలో నూతన పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీ పై వారం రోజుల శిక్షణను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఒ.ఎమ్డి హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధన పట్ల ప్రత్యేకమైన ఆసక్తిని, అభిరుచిని పెంపొందించు కోవాలని కోరారు. విద్యార్థులు సరికొత్త విషయాలు పరిశోధన అంశాలపై జిజ్ఞాసతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్యామ్ మోహన్ డేవిడ్ రాజు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు పరిశోధన అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకునేందుకు పరిశోధనలు తమ చాతుర్యాన్ని ప్రదర్శించేందుకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుందన్నారు.

ఫ్యాకల్టీలకు శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టం, మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు "మాస్టర్ ట్రైనర్స్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం" అనే అంశంపై సోమవారం శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యుజిసి సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి, డిప్యూటీ సెక్రటరీ డా.శాలిని, ఐకెఎస్ నేషనల్ సెక్రటరీ ప్రొఫెసర్ గంటి సూర్యనారాయణ మూర్తి విచ్చేశారు. విశ్వవిద్యాలయం విసి ఆచార్య జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి హాజరయ్యారు. ముఖ్య అతిథి యుజిసి సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి మాట్లాడుతూ ఈ వారం రోజులు పాటు భారతీయ విజ్ఞాన పరంపర అనే అంశం పైన భారతదేశంలోని వివిధ విశ్వ విద్యాలయాలకు చెందిన విభిన్న అధ్యాపకులకు భారతీయ జ్ఞానపరంపరలో ఉన్న గొప్ప గొప్ప వైజ్ఞానిక అంశాలను వారికి వివరించారు. ఆ విషయాలను ఏ విధంగా ఆధునిక కాలంలో ఆధునిక విజ్ఞానానికి అనుసరించి మనం తెలపాలనే విషయంపై ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టం నేషనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంటి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపర మన భారతదేశంలో ఉన్న ప్రాచీన సంస్కృతంలో చాలా చక్కగా వర్ణించారన్నారు. అందులో వున్న అమూల్యమైన విషయాలను అధ్యాపకులు తెలుసుకుని వాటిపైన ఎలాంటి పరిశోధనలు? ఏ విధమైన పనులు చేయాలి? అనే అంశాన్ని తెలిపేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయం విసి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చక్కటి మాస్టర్ ట్రైనర్స్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించడం చాలా ఆనందదాయకమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లుగా అనుసంధాన ప్రకాశం, విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ శివరాంభట్, ప్రొఫెసర్ కె.సూర్యనారాయణ, ప్రొఫెసర్ పి.వెంకట్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలపై యూజీసీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏబిఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి విచ్చేసిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ జోషిని కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు , ఎయిడెడె డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పైన, ఇతర విద్యా సమస్యల పైన వినతి పత్రం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో దాదాపు 5వేల అధ్యాపకుల ఖాళీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలలో దాదాపు 3 వేల అధ్యాపకుల ఖాళీలు ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన మార్గదర్శకాలు విడుదల చేయాలని, ఉన్నత విద్యాసంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులకు యూజీసీ మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్ మంజూరు చేసే విధంగా నోటిఫికేషన్ జారీ చేయాలని, రాష్ట్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న పరిశోధక విద్యార్థులకు కూడా ప్రధానమంత్రి పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్ ను మంజూరు చేయాలని, విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు రావలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేసే దానికి సరైన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు అందరికీ కూడా జాతీయ విద్యా విధానం పైన, సింగిల్ మేజర్ సబ్జెక్టు పైతగినంత శిక్షణ ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా యుజిసి కార్యదర్శి ప్రొఫెసర్ మనీష్ జోషి మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై యూజీసీ చైర్మన్, ఇతర అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని, నూతన జాతీయ విద్యా విధానం, ఇండియన్ నాలెడ్జిపై అవగాహన కల్పించడానికి అధ్యాపకు లందరికీ శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్ఎస్ ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బుల్ టీ దాస్‌పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో టీవీఎస్ సుందరం కంపెనీ క్యాంపస్ డ్రైవ్ (ప్రాంగణ ఎంపికలు) నిర్వహించిందని ఇందులో ఈసీఈ, ఈఈఈ విభాగాలకు చెందిన 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కంపెనీ హెచ్ఆర్ ఎస్ ఆదినారాయణన్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభించాలనే లక్ష్యంతో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడానికి ఎప్పుడూ సంసిద్ధత చూపుతున్నామన్నరు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకొని జీవిత లక్ష్యాలను చేరుకోవా లని ఆకాంక్షి స్తున్నామన్నా రు. సోమవారం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నిర్వహిం చిన ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన వారికి 2 లక్షల రూపాయల వార్షిక వేతనంగా కంపెనీ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి టి విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు

పట్టాల రిజిస్ట్రేషన్లలో నిర్లక్ష్యం ఎందుకు..?

లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జగనన్న నవరత్నాల పథకాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు అనే పథకం ద్వారా జగనన్న ఇంటి పట్టాలను మంజూరు చేశారేగాని, పట్టాలు పొందిన లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్లు చేయించడంలో చూపిన నిర్లక్ష్యం ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. మంగళం పరిధిలోని మంగళం గ్రామపంచాయతీలో దాదాపు 210 మందికి రిజిస్ట్రేషన్లు కాలేదని సోమవారం గ్రామ సచివాలయం ముందు లబ్ధిదారులు పట్టాలతో నిరసన తెలిపారు. జగనన్న ఇళ్ల పట్టాలు అందించి ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో హడావిడిగా స్థలాలు చూపారని, కానీ రిజిస్ట్రేషన్లు సచివాలయం ద్వారా చేయిస్తారని రోజుల తరబడి తిరుగుతున్నా పట్టాలలో సర్వే నంబర్లు తప్పుగా నమోదు చేశారని, పేర్లు నమోదు తప్పుగా జరిగిందని అధికారులు చెబుతూ రోజులు గడిపేసారని స్థానిక జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులు మీడియా ముందు తమ ఆవేదనను తెలిపారు. ఎన్నికలలోపు చేయిస్తామని హామీ ఇచ్చారని, నేడు ఎన్నికల తర్వాత అంటూ మొహం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సవరణలే అని చెబుతున్న అధికారులు వాటిని సరిచేయడానికి కాలయాపన చేస్తూ ఇప్పుడేమో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని చెబుతూ మాట దాటవేస్తున్నారన్నారు. అధికారులపై తమకు నమ్మకం పోయిందని, జగనన్న ఇంటి పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయిస్తారా లేదా?' అని సచివాలయం వద్ద భీష్మించుక కూర్చున్నారు. పంచాయతీ ప్రతినిధులు వారించినా లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలని తేల్చిచెప్పారు.

మాకు నమ్మకం లేదు..

జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపాలని రెండుసార్లు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపితే అదిగో ఇదిగో మంటూ ఎన్నికల ముందు బస్సులు పెట్టి చూపించారు. అయితే తీరా రిజిస్ట్రేషన్లు జరిగే సమయంలో అధికారులు మీ పట్టాలలో సర్వే నంబర్లు తప్పుగా ఉన్నాయన్నారు. తప్పుగా నమోదు చేయబడిన సర్వే నంబర్లను సరిదిద్దాలని కోరి సచివాలయం చుట్టూ ప్రదక్షణగా తిరుగుతున్న పట్టించుకునే దిక్కులేదు. దీంతో మాకు నమ్మకం లేకుండా పోయింది.

- మంగమ్మ, ఎన్సిబిఎన్ కాలనీ, మంగళం

కోడ్ వచ్చేసింది చేయలేమంటున్నారు..

పట్టాలు ఇచ్చి సంవత్సరాలు అయింది. రిజిస్ట్రేషన్లు చేస్తామని వాలంటీర్లు చెప్పడంతో సచివాలయానికి వెళ్ళాము. కానీ అక్కడ మీ పట్టాలో సర్వేనెంబర్ తప్పుగా నమోదు అయిందని దాన్ని సరి చేస్తే గాని రిజిస్ట్రేషన్లు కావనిని అధికారులు చెప్పారు. సర్వే నంబర్లు సరి చేయించుకోవడానికి నెలరోజులుగా తిరుగుతూనే ఉన్నాను. ఇప్పుడేమో కోడ్ వచ్చేసింది చేయలేమంటున్నారు. మాకు రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వాలి.

- భవాని, మంగళం క్వార్టర్స్, మంగళం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా

కోడ్ అమలులో ఉంటే జగనన్న ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు, పట్టాలలో మార్పులు చేర్పులకు అవకాశం ఉందా అన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాను. వారి ఆదేశానుసారం లబ్ధిదారులకు న్యాయం చేస్తాం.

- నారాయణరెడ్డి, తహశీల్దారు తిరుపతి అర్బన్ మండలం.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో నలుగురుకి స్వల్ప గాయలైన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు రైల్వే స్టేషన్ సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురు ప్రయాణికులతో పాటు, బస్సు కండక్టర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ మితిమీరిన పని ఒత్తిడి కారణంగా నిద్రలేమితో బస్సును వెనకనుంచి ఢీకొట్టున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా శ్రీకాళహస్తి ఆర్టిసి డిపోలో డ్రైవర్ల పై పని ఒత్తిడి ఎక్కువ అవుతోందనే విమర్శలు విపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు డ్రైవర్లు కూడా ఒత్తిడికి తాళలేక అనారోగ్య సమస్యలతో మృతి చెందిన సంఘటన కూడా చోటు చేసుకున్నాయి. సోమవారం జరిగిన ఘటనలో డ్రైవర్ నిద్రలేమి కారణంగా లారీని ఢీ కొట్టినా ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా, డ్రైవర్ల పై ఆర్టీసీ యాజమాన్యం ఒత్తిళ్లు పెంచకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య కోరారు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో జనావాసాల్లోకి అకస్మాత్తుగా చుక్కల దుప్పి వచ్చింది. తరచుగా ప్రతి ఏడాది ఎండా కాలంలో చుక్కల దుప్పిలు జనవాసాల్లోకి రావడం సహజం. సోమవారం కోట మండలంలోని బాల భారతి స్కూలు ఎదురుగా ఓ వీధిలో చుక్కల దుప్పి ప్రత్యక్షమవడంతో దాన్ని కుక్కలు వెంటాడాయి. చుక్కల దుప్పికి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్స కోసం తీసుకెళ్లారు. స్థానికులు తక్షణమే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం అనంతరం అటవీ ప్రాంతంలో వదిలేస్తామని అటవీ అధికారులు తెలిపారు.

ఆటోను తప్పించపోయి ట్రాన్సుఫార్మర్‌ను ఢీకొన్న కారు

- తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -కోట : ఆటోను తప్పించపోయి కారు ట్రాన్సుఫార్మర్‌ను ఢీకొన్న సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. కోట మండలం విద్యానగర్ బాలభారతి స్కూలు ఎదురుగా ఆర్అండ్ బి రోడ్డుపై వస్తున్న నేపథ్యంలోఎదురుగా వస్తున్న ఆటోను తప్పించపోయి మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. విద్యానగర్ ఎన్‌బికే ఆర్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి డ్రైవింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎవరకి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొనడంతో తక్షణమే విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేసి అప్పటికప్పుడే మరమ్మతులు చేపట్టారు.

ఆశ వర్కర్ల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఓజిలి : ఓజిలి మండలం ఆశ వర్కర్ల సమావేశం నాయుడు పేటలోని సుందర్ రామిరెడ్డి భవన్ లో సోమవారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు కవిత లక్ష్మి , కోశాధికారి సుజాత ముఖ్య అతిథు లుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని డిమాండు చేశారు. అధిక జనాభాను అనుసరించి ఆశా కార్యకర్తలను కొత్తగా నియ మించాలని కోరారు. ఆశా కార్యకర్తలు హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా రోహిణి, కార్యదర్శిగా కోటమ్మ, ఉపాధ్యక్షురాలుగా గౌరమ్మ, సహాయ కార్యదర్శిగా గురవమ్మ, తదితరులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.



ఎన్నికైన ఆశ వర్కర్స్ మండల కమిటీ సభ్యులు

ఐఐటిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి -ఏర్పేడు : ఐఐటి తిరుపతి సివిల్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ సిమెంటిషియస్ మెటీరియల్స్ క్యారక్టరైజేషన్, లేబరేటరీ టెస్టింగ్‌పై హై ఎండ్ వర్క్ షాప్‌ని ఐఐటి కాన్పూర్ నుండి ప్రొఫెసర్ సుధీర్ మిశ్రా, ఐఐటి తిరుపతి ప్రొఫెసర్ సురేష్ జైన్, ప్రొఫెసర్ అనిల్ కుమార్‌లతో సోమవా రం విజయవంతంగా ప్రారంభించారు. యక్సలరేట్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్ స్పాన్సర్ చేసిన ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ ఈ నెల 18వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించనున్నారు.



ఐఐటిలో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్లు

21న బహిరంగ వేలం

ప్రజాశక్తి -చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు గ్రామ పంచాయితీలో బస్టాండు వారపు సంత, షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణకు సంవత్సర కాలం పాటు రుసుము వసూలు చేసుకొనే హక్కు కల్పించే ప్రాతిపదికనకు ఈ నెల 21 వ తేదీ గురువారం 11.30 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యాలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనాలనుకున్నవారు దిన, వారపు సంత, బస్టాండుకు రూ.50, షాపింగ్ కాంప్లెక్స్ గదులకు రూ.30 వేలు దరఖాస్తు వుసుం చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనివార్య కారణాలవల్ల వేలం రద్దు చేసేందుకు, వాయిదా వేసేందుకు అధికారం వుందని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

బోరు కావాలంటే కార్పొరేటర్‌కు కప్పం కట్టాలా: చినబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

'ప్రజలు వారి అవసరాల కోసం సొంత బోరు వేసుకోవాలన్న కార్పొరేటర్‌కు కప్పం కట్టాలా?' అని టిడిపి తిరుపతి పట్టణ అధ్యక్షులు వట్టికుంట శంకరనారాయణ(చినబాబు) ప్రశ్నించారు. సోమవారం సామాజిక మాధ్యమాల్లో తిరుపతి నగర పరిధిలోని 45వ డివిజన్ కార్పొరేటర్ అనీష్ రాయల్ స్థానిక ప్రజలు బోరు వేసుకోవడానికి ప్రయత్నించగా తనకు పదివేలు ఇస్తేనే బోరు వేసుకోవాలంటూ తన అనుచరులను వెంటబెట్టుకొని ఇక్కడి స్థానిక ప్రజలపై దాడులకు యత్నించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ప్రజలు వారి అవసరాల కోసం బోరు వేసుకోవాలన్నా ఇలా దౌర్జన్యంగా కార్పొరేటర్ వ్యవహరించడం అమానుషమన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డిని అడ్డుపెట్టుకొని స్థానిక కార్పొరేటర్ ప్రజలపై ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చినబాబు ప్రకటించారు.

పట్టాలిచ్చారు..హద్దులు మరిచారు..

తహశీల్దారుకి ఎస్‌సి, ఎస్‌టిల ఫిర్యాదు

ప్రజాశక్తి -కోట : 'మాకు పట్టాలు ఇచ్చారు..కాని ఇప్పటి వరకు హద్దులు చూప లేదు..ఇప్పటికైనా స్పందించి హద్దు లు చూపండి..' అంటూ తహశీల్దారుకు చెందోడు గ్రామ ఎస్‌సి, ఎస్‌టిలు బిఎస్‌పి నాయకులతో కలిసి సోమవారం ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని చెందోడుకి చెందిన ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన చింతల పూడి, సుశీలమ్మ, చింతలపూడి నాగమణి, మొగిలి గుంట బుజ్జమ్మ, గోను సుబ్బమ్మ, వాకాటి మార్తమ్మలు బీఎస్పీ నాయకులతో కలిసి కోట తహశీల్దారు నాగరాజు రావుకు వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 82/1 సర్వే నెంబర్ లో 2.80 సెంట్లు భూమి ఉందని గుర్తు చేస్తూ తమకు 2010లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చారని ఈ సమస్యపై గతంలో పలు మార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించు కోలేదన్నారు. మా పొలాలు పక్కనే ఉన్న ఓ వ్యక్తి మమ్మల్ని భయభ్రాం తులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తమ సమస్యకు పరిష్కా రం చూపాలని కోరారు. స్పందించిన తహశీల్దారు పరిశీలించి న్యాయం చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.